


'ఏమీ తోచడం లేదు. చెయ్యడానికి కూడా ఏమీ లేదు. అలా పోయి ఓ కాఫీ తాగొస్తే?—రైట్। ఈ ఆలోచన బాగుంది. కాఫీ తాగినట్టూ వుంటుంది. ఓ గంట కాలక్షేపం అయినట్టూ వుంటుంది.' అనుకొని జనార్దనం బయల్దేరాడు.

ఓ హోటల్ ముందు జనం

గుంపులు గుంపులుగా వున్నారు. లోపల ఖాళీ వుండ వచ్చునవే ఆశతో ముందుకి కదిలాడు.

"ఏ వూరో ఏమిటో, పాపం!" అని గట్టిగా బాధపడి పోతున్న ఓ గొంతు జనార్ధనాన్ని గుంపులో దూరేట్లు చేసింది.

సత్తువ వుడిగి, ముడతలు పడిన ఎర్రని శరీరం, మాసిపోయిన ఖద్దరు బనీను. మోకాళ్ళ వరకు కట్టిన పంచెతో నేలమీద పడివుంది. గెడ్డం పెరిగి వుంది. తెల్లటి మీసాలు బాగా ఎదిగి పెదవుల్ని కప్పేశాయి. (పడిపోయాక కాదు సుమండీ) కొనదేరిన ముక్కు వయసులో వున్నప్పుడు చూపరులను బాగా ఆకర్షించే దాననని చెబుతోంది. ముక్కు పుటాలు అప్పుడప్పుడు కదులుతున్నాయి. ఆ శరీరానికి పక్కగా ఓ చేతి కర్ర పడివుంది. ఏక్సిడెంటేదైనా జరిగిందేమోనని చుట్టుపక్కల పరికించాడు జనార్ధనం. ఆ చిహ్నాలేమీ కనిపించక, "ఏమయింది?" అని పక్కవాళ్ళని ప్రశ్నించాడు.

"ఏమోనండీ!" నలుగురయిదుగురు బదులిచ్చారు.

"ఏక్సిడెంటు అయిందా?" స్వరం హెచ్చించి అడిగాడు.

"కాదు. నడుస్తూ, నడుస్తూ పడిపోయాడు. ఏమయిందో ఏమో ముసలాడికి!" అవతలి పక్క నుంచి జవాబు వచ్చింది.

"అరె పాపం! ఎంత సేపయింది?"

"అరగంటపైనే అవుతుందండీ!"

"మరి ఆసుపత్రికి పంపకుండా చోద్యం చూస్తున్నట్టు నిలబడ్డారా?" అని జనార్ధనం అనేసరికి, పక్కనే స్కైలాబ్ ముక్క పడినట్టు కకావికలై పోయారు. ముగ్గురు హైస్కూలు విద్యార్థులు మాత్రం మిగిలారు.

"అతన్ని ఆస్పత్రికి తీసుకెడదాం! సాయం రండి!" ప్రాధేయపడి అడిగాడు జనార్ధనం.

'ఏంటీ లేనిపోని తద్దినం?' అన్నట్లు ముఖం పెట్టి, "నాకు రావడానికి తీరిక లేదండీ! నేను రాను" నిక్కచ్చిగా అన్నాడు.

కొంచెం దూరంలో వున్న రిక్షావాళ్ళని పిలిస్తే, వాళ్ళు రామన్నారు. మరికొందరు వినిపించుకోకుండా వెళ్ళి పోయారు. 'ఎలా తీసుకెళ్ళాలా?' అని ఆలోచిస్తుండగా రెండెడ్ల బండొకటి ఖాళీగా వెడుతూ కనిపించింది. బండి వాడిని బ్రతిమాలి విద్యార్థుల సాయంతో

ముసలతన్ని బండిలోకి ఎక్కించాడు.

డాక్టరు ముసలతన్ని పరీక్షించి, "చాలా నీరసంగా ఉన్నాడు." అని ఓ ఇంజక్షనిచ్చాడు. "పావు గంట తర్వాత మళ్ళీ పిలవండి!" అంటూ వెళ్ళిపోయాడు. ఒంటరిగా ముసలతన్ని వదిలి వెళ్ళడానికి మన సొప్పని జనార్దనం అక్కడే కూర్చుండి పోయాడు.

ఇరవై నిముషాలు గడిచాక డాక్టరు వచ్చి, "పల్స్ యింకా నీర్సంగా కొట్టుకుంటోంది. కాంపౌండర్! సెలైన్ ఎక్కించడానికి ఏర్పాట్లు చెయ్యి" అన్నాడు.

"సెలైన్ తెప్పించాలి సార్!" అని కాంపౌండర్ అనగానే, డాక్టర్ ఓ చీటీ రాసిచ్చాడు.

* * *

సెలైన్ తీసుకొచ్చిన జనార్దనానికి ముసలతను కనిపించలేదు. అతన్ని పడుకోబెట్టిన బెడ్ మీద తెల్లటి దుప్పటి కప్పివుంటే, బెడ్ మార్చారేమో అనుకొని, డ్యూటీలోవున్న నర్సుని వాకబు చేశాడు.

"ఆ ముసలాడా! చనిపోయాడు!" మెల్లిగా జవాబిచ్చింది.

మంచికెడితే చెడు ఎదురయినట్టు యిలా అయిందేమిటీ అని బాధపడుతుండగా, "శవాన్ని తొందరగా తీసుకెళ్ళాలి" అంటూ సిస్టర్ తొందర చేసింది. డాక్టరు వద్దకు వెళ్ళి, పరిస్థితి వివరించాడు.

డాక్టర్ ఏమీ మాట్లాడక ఫోనెత్తి, "కనెక్ట్ మీ పోలీస్ స్టేషన్!" అన్నాడు.

పోలీసులొచ్చేవరకూ జనార్దనం అక్కడే వుండాలిసి వచ్చింది.

రెండు గంటలు భారంగా గడిచాయి. ఇద్దరు కానిస్టేబుళ్ళ వెనుక సబిన్స్పెక్టర్ హడావుడిగా వచ్చి, "శవం ఎక్కడ చచ్చింది?..." అని తొందరగా అనబోతూ జనార్దనాన్ని చూసి, "చనిపోయిందెవరు?" అన్నాడు గబగబా.

డాక్టర్ శవాన్ని చూపాడు. "వివరాలు నాకు తెలీదండీ! ఈయనే ఎడ్మిట్ చేశారు" అని జనార్దనాన్ని చూపాడు.

"ఓహో జనార్దనం గారా! వివరాలు చెప్పండి."

జనార్దనం చెప్పేది వింటూ, శవం దగ్గరకు వెళ్ళి, ముసుగు తొలగించి చూసి, ఓ కానిస్టేబుల్ని అక్కడ కాపలా వుంచాడు. జనార్దనాన్ని తనతో తీసుకు వెళ్ళాడు.

స్టేషనుకు వెళ్ళాక, సీట్లో కూర్చొని, హేట్ తీసి టేబుల్

మీద వుంచాడు సబ్‌యిన్స్పెక్టర్. జనార్ధనాన్ని లోపలికి పిలిపించాడు. అతను రాగానే ఎడమ చేత్తో గెడ్డం మీద రాసుకుంటూ, "మీకూ ముసలతనికి ఏమిటి సంబంధం?" అని ప్రశ్నించాడు.

"ఇందాకనే చెప్పాను కదండీ! అతని గురించి నాకేమీ తెలీదు. రోడ్డు పక్కన పడివుంటే ఆస్పత్రిలో చేర్పించాను. డాక్టరు ఒక యింజక్షన్ యిచ్చారు. తర్వాత నేను సెలైన్ బాటిల్ తేవడానికి వెళ్ళాను. తిరిగి వచ్చేటప్పటికి ముసలతను చచ్చిపోయాడని సిస్టర్ చెప్పింది."

"అంటే డాక్టరు యింజక్షను వలన అతను చనిపోయాడంటారా?"

"అలా అని నేను అనలేదు కదండీ! జరిగింది చెప్పాను- అంతే!"

"అది సరే, ముసలతన్ది ఏ వూరు?"

"తెలీదండీ!"

"అతను యిక్కడికి ఎందు కొచ్చాడు?"

"అదీ తెలీదండీ!"

"ఇంతకు ముందెప్పుడూ చూడ లేదా?"

"లేదండీ!"

"ఎప్పుడూ?"

"అబ్బే, చూడ లేదండీ!"

"అతని పేరేమిటి అన్నావు?"

"నాకు తెలీదని యిందాక చెప్పాను. మీరు మళ్ళీ మొదటి కొస్తున్నారు" చిన్నగా అన్నాడు.

"మరి అతని విషయంలో అంత శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఏమిటి?" అంటూ యిన్స్పెక్టర్ లేచి నిలబడ్డాడు.

"అక్కడున్న జనంలో ఎవరూ పట్టించుకోలేదు. మానవతా దృష్టితో అతని పట్ల శ్రద్ధ తీసుకున్నాను. ముగ్గురు విద్యార్థులు తప్ప సాయం చేయడానికి కూడా ఎవరూ రాలేదండీ!" అడిగిన ప్రశ్న పదే పదే అడుగుతున్నా విసుగుదలను కనిపించనీకుండా జవాబిచ్చాడు జనార్దనం.

"అక్కడి వాళ్ళలో లేని దృష్టి మీ ఒక్కరిలోనే వుందా? వాళ్ళెవరూ మనుషులు కాదా?" ఇన్స్పెక్టర్ మాటల్లో అవహేళన తొంగి చూసింది.

"నాకు తెలిసింది మీకు పూర్తిగా చెప్పినా, మీ ప్రశ్నలతో నన్ను అవమానిస్తున్నారు. నా మీద అనుమానం పెంచుకుంటున్నారు."

"షటప్! ప్రశ్నకు జవాబు

చెప్పవలసిన బాధ్యత నీకుంది. ప్రతి నేరస్థుడూ ముందు యిలాగే కబుర్లు చెబుతాడు. నీలాటి వాళ్ళని ఎంత మందిని చూశానో తెలుసా!" ఇన్స్పెక్టర్ ముఖం ఎర్రబడింది. మాటలు కరుగ్గా వచ్చాయి.

పోలీసు జులుం అంటే ఏమిటో అర్థమవుతున్న జనార్ధనం నిస్సహాయంగా వుండిపోయాడు. కాసేపటికి తేరుకుని, "నాకు యింతకు మించి ఏమీ తెలీదు. అధికారం చేతిలో వుందని యిష్టమొచ్చిన ప్రశ్నలు వేస్తారు. అందుకనే నిజం తెలిపిన వాళ్ళు కూడా సాక్ష్యం యివ్వడానికి వెనుకంజ వేస్తారు....కాదు. ఎవరూ ముందుకు రారు. దీనివలన నిరపరాధులు....—" వాక్యం పూర్తి కాకుండా జనార్ధనం చెంప ఛెళ్ళుమంది.

"ఇతన్ని రిమాండులో వుంచండి!" అంటూ హుకుం జారీ చేసి శవ పంచాయితీ ఏర్పాట్లలో మునిగి పోయాడు.

* * *

శవ పంచాయితీ జరుగుతుంది. సభ్యుల్లో ఒకరు శవాన్ని గుర్తించి, "ఇతనిది రామాపురం!" అన్నారు. జనార్ధనం అప్పుడప్పుడు ఆ వూరు వెడుతుంటాడని మిగిలిన సభ్యులు చెప్పారు.

శవాన్ని పోస్టుమార్టమ్‌కి పంపి, పంచాయితీ రిపోర్టు తీసుకుని స్టేషన్‌కు వెళ్ళాడు యిన్స్పెక్టర్.

"ఏవో స్వంత పనులమీద రామాపురం వెళ్ళిన మాట వాస్తవమే! అంత మాత్రాన అక్కడి వాళ్ళందరూ నాకు ఎలా తెలుస్తారు?" అన్నాడు జనార్ధనం- యిన్స్పెక్టర్ ప్రశ్నకు జవాబుగా.

"ప్రశ్నకు ప్రశ్న జవాబు కాదని గుర్తుంచుకో మిస్టర్!" అని ఓ కానిస్టేబుల్ని రామాపురం పంపాడు.

జనార్ధనం స్నేహితులు ఇన్స్పెక్టర్ని కలిశారు. బెయిల్‌మీద విడిచిపెట్టమని రిక్వెస్టు చేశారు. ప్రయోజనం లేకపోయింది. అతనితో మాట్లాడటానికి పర్మిషన్ మాత్రం వచ్చింది.

"ఏరా! ఎన్నిసార్లు చెప్పినా మా మాట లెక్కచేయవు. ఆశయాలు, ఆదర్శాలంటూ పాకులాడి ప్రతీదీ నెత్తి మీదికి తెచ్చుకుంటున్నావు. ఇప్పుడేమో ఇన్స్పెక్టర్ బెయిల్ ఇవ్వనంటున్నాడు" మందలిస్తున్నట్టుగా అన్నాడు సెల్ దగ్గరకు వెళ్ళిన జనార్ధనం మిత్రుడు.

"అదేం? ఇదివరకు మర్డర్ కేసుల్లో కూడా కొంతమందికి

బెయిల్ ఇచ్చాడు. నాకు ఎందు కివ్వడట? వీడి దృష్టిలో ఆ నేర స్థులే పెద్ద మనుషులా?" తీవ్రంగా అన్నాడు.

"ఉష్! మెల్లిగా మాట్లాడు. వింటే బాగుండదు."

"ఏం మెల్లిగా? మనిషికో న్యాయం చెప్పే వీళ్ళు అధికార్లా? చట్టాన్ని వంచి, వీలైన రీతిలో మలుచుకొని, నేరస్థులను రక్షించే వీళ్ళకి అధికారాలా?" సాలోచనగా అన్నాడు.

"...... ...... ......"

"వీడి అవినీతి గురించి మనం పిటిషన్ పెట్టిన సంగతి తెలిసి ఇలా చేస్తున్నాడంటావా?"

"ఏమోరా! నాకింతవరకూ తట్టనేలేదు. నేను మళ్ళీ వస్తా."

"రైట్! వెళ్ళిరా రంగా!"

ఇన్‌స్పెక్టర్ గదిలో పచార్లు చేస్తూ- 'బెయిలిచ్చి, విడుదల చేయాలా? లంచాలు తీసుకుని నేను కేసులు మాఫీ చేస్తున్నానని, లైసె న్సులేని లారీలు, ట్రాక్టర్లు పట్టు కుని, వాళ్ళచేత సొంత పనులు చేయించుకుని వదిలేస్తున్నానని పిటి షన్లు పెడతారా? ఎంక్వయిరీ జరప మని కోరతారా? ఈ కేసులోంచి జనార్దనం ఎలా బయటపడతాడో చూస్తాను. ఆదర్శాలు వల్లె వేస్తు న్నాడు- ఆదర్శాలు! అందుకనే ఎమ్మే పాసై నాలుగేళ్ళయినా ఏ ఉద్యోగమూ లేదు. తనకు తాను బాగుపడటం రాదు. సంఘాన్ని బాగు చేస్తాడట.' ఆలోచిస్తూ-'అరె! స్పాట్‌కి వెళ్ళి ఎంక్వయిరీ చెయ్యనే లేదు' అనుకొని కానిస్టేబుల్ని తీసు కుని వెళ్ళాడు.

* * *

'గుండెకు బలమైన దెబ్బ తగ లడం వలన మరణం సంభవిం చింది. ఏ విధమైన ఆహారమూ తీసుకున్న సూచనలులేవు.' పోస్టు మార్టమ్ రిపోర్టు చదివి నిట్టూ ర్చాడు ఇన్‌స్పెక్టర్. 'జరిగిన విష యము చెప్పడానికి ఎవరూ ముందుకూ రాలేదు. ప్రతివాడూ మాకు తెలీదు సార్! అని తప్పించు కున్నారు' అనుకుంటుండగా, టెలి ఫోన్ మోగింది. విసుగ్గా రిసీవర్ తీసుకుని కంగారు పడిపోయాడు.

"సార్! అవును సార్! సబ్ ఇన్‌స్పెక్టర్నిసార్..గుడ్‌మార్నింగ్ సార్! ఎస్సార్! రిపోర్టు వచ్చింది సార్! ఇప్పుడే సార్! అవును సార్! బెయిల్ ఇవ్వకూడదేమో నని అనుమానించాను సార్! రైట్ సార్! ఇప్పుడే...వుంటాను సార్!" రిసీవర్ జాగ్రత్తగా క్రెడిల్ మీద వుంచి, ముఖానికి పట్టిన

చెమట తుడుచుకున్నాడు. తొట్రుపాటు కాస్త తగ్గాక, జనార్దనం మిత్రులను రమ్మని అర్జంటుగా కబురు చేశాడు. 'వీళ్ళకి ఇంత పలుకుబడి ఉందని తెలిస్తే అడిగిన వెంటనే బెయిలు ఇద్దును. నా పీకల మీదకి తేరు కదా' ఆలోచించ సాగాడు.

జనార్దనాన్ని విడుదల చేస్తూ, "అవసరమైనప్పుడు హాజరు కాక పోతే నా ప్రాణం మీదకి వస్తుంద"ని పదిసార్లు చెప్పాడు.

బైటకు వచ్చాక "హైస్కూల్ విద్యార్థులు సాయం చేశారు కాబట్టి, వాళ్ళు సాక్ష్యం చెబుతారు. ఆ బండి వాడిది ఏ ఊరో తెలీదు" అన్నాడు జనార్దనం స్నేహితులతో.

"మైనర్లు చెప్పే సాక్ష్యం చెల్లదేమో? ఇప్పుడెలా?" అన్నాడు రంగా.

"పోనీ, సాక్ష్యం సృష్టిద్దాం." మరో మిత్రుడు సలహా ఇచ్చాడు.

"ఒరేయ్! దొంగ సాక్ష్యాలు సృష్టిస్తారా? అదేం కుదరదు. నిజం బయటపడి తీరుతుంది. తప్పుడు సాక్ష్యాలు మనకే ఎదురు తిరుగుతాయి" అన్నాడు జనార్దనం కేసులో ఇరుక్కుంటున్నాననే బాధ ఏమాత్రం లేకుండా.

"రంగా! నువ్వు వెంటనే రామాపురం వెళ్ళి ఎంక్వయిరీ చెయ్యి. ఆ ముసలాడికి సంబంధించిన వాళ్ళెవరైనా ఉన్నారేమో తెలుసుకో!" పురమాయించాడు ఒక స్నేహితుడు.

ఎంక్వయిరీ కోసం వెళ్ళిన కానిస్టేబుల్‌కి సమాచారం సేకరించడంలో రాత్రి బాగా పొద్దుపోయింది. అలిసి పోయాడు. 'పోలీస్ ఉద్యోగం అంత వెధవ ఉద్యోగం ఇంకోటి లేదు. డ్యూటీకి ఒక టైమూ పాడూ లేద'ని విసుక్కుంటూ బయల్దేరి వెళ్ళాడు. తెల్లారిన తర్వాత ఇన్‌స్పెక్టర్ని కలిశాడు.

'తలా తోకాలేని కేసులు ఏవో ఒకటి వస్తుంటాయి. ఎంత సమాచారం సంపాదించినా కోర్టులో ప్లీడర్లు ఏవో చచ్చు ప్రశ్నలు వేసి కన్ఫ్యూజ్ చేసేస్తారు. తికమక పడిపోయి తోచిన జవాబు చెప్పితే కేసంతా తలక్రిందు లవుతుంది.' జనార్దనం కేసు ఏమవుతుందో అని ఆలోచిస్తూ తన కోపం ఎలా తీర్చుకోవాలా అని పథకాలు వేస్తూ నిద్రకు దూరమైన ఇన్‌స్పెక్టర్‌లో హుషారు తగ్గింది. కళ్ళు ఎర్రబడ్డాయి.

"ఆ ముసలాడు చాలా బీద

వాడుటండీ! తినడానికి తిండి లేదు. ఏ పనీ చేయలేడు. దయతలచి ఎవ రేనా పెడితే తింటాడట. ఎవర్నీ ఏదీ అడగడట! చచ్చిపోయాడని తెలిశాక 'వాడి కష్టాలు గట్టె క్కాయి' అని అన్నారు అక్కడి వాళ్ళు!" అని చెప్పిన కానిస్టేబుల్ తను రికార్డ్ చేసిన స్టేట్ మెంట్ ఇచ్చాడు.

'తిండీ తిప్పలు లేక ముసలాడు శోషవచ్చి పడిపోయాడా? అతని చావుకు అదే కారణమా? జనార్ద నాన్ని అనవసరంగా యిరికిస్తు న్నానా?' అన్న ప్రశ్నలు లోపల్నుంచి తన్నుకువచ్చి యిన్ స్పెక్టర్ గుండె లపై దిగబడ్డాయి.

'జనార్దనాన్ని రక్షించాలా?.... వీళ్ళంతా పిటీషన్లు పెట్టి నాకు దెబ్బ కొట్టడానికి ప్రయత్నిస్తున్నా రే.... దెబ్బకు దెబ్బతీస్తే.... అతను నేరస్థుడు కాదనే విషయం అను క్షణం కడుపులో మెలి తిప్పుతుం దేమో... జనార్దనాన్ని రక్షించా లంటే సరియైన సాక్షులు కావాలి. హోటల్ యజమాని నిజం చెప్ప కుండా తన కేమీ తెలీదని తప్పిం చుకుంటున్నాడు...ఎవరూ సాక్ష్యం చెప్పడానికి రావటంలేదు. లోకా చారం ప్రకారం దొంగ సాక్షుల్ని సృష్టించాలా....ఏమయితే అదే అవుతుంది. నా డ్యూటీ నేను నిర్వర్తించాను. ఆ సమయంలో అక్కడ ఎవరున్నా అనుమానించి సమాచారం రాబట్టవలసిన బాధ్యత పోలీసు అధికారిగా నా కుంది. కేసు కొట్టేస్తే గొడవే వుండదు. కోర్టు వ్యవహారాలూ అంత తొందరగా పూర్తికావు. రెండు మూడు వాయిదాలు తిరిగేక జనార్దనం నా దారికి రాకపోడు. అప్పుడు ఏదైనా చెయ్యొచ్చు. అంతగా రాకపోతే అప్పుడు చూద్దాం' ఆలోచనల్తో సతమతమవుతూ యిన్ స్పెక్టర్ కోర్టుకి బయల్దేరాడు.

'వీడు ఈ కేసులోంచి బయట పడతాడో, లేదో?' అన్న భయంతో నిద్రపట్టని జనార్దనం మిత్రుడు తెల్లవారకుండా అతనింటికి వెళ్ళి కూర్చున్నాడు. చీకూ చింతా లేని జనార్దనం స్నేహితుని రాకతో నిద్రలేచాడు.

కొత్త ప్రదేశంలో రాత్రంతా కలత నిద్రకు గురైన రంగా బడ లికగా కనిపించాడు. కాని, అతని హుషారు చూసిన మిత్రునికు ఆతృత ఎక్కువయింది. రంగా చెప్పింది విన్నాక వాళ్ళలోని ఆం దోళన కాస్త తగ్గింది.

జనార్దనంతో కోర్టుకి వెళ్ళని రంగా, ఆ రోజంతా టేప్‌రికార్డర్

కమ్ రేడియోతో వూళ్ళో తిరిగాడు. తరుచు అలా తిరుగుతాడు కాబట్టి ఎవరూ పట్టించుకోలేదు.

చీకటి పడుతుండగా రంగా బస్‌స్టాండ్ కెళ్ళి నిలబడ్డాడు. కాసేపటికి బస్సులోంచి దిగుతున్న జనార్దనాన్ని చూసి గబగబా అతనికి చేరువయి భుజంమీద చెయ్యేసి పలకరింపుగా నవ్వాడు.

"కేసు వాయిదా పడింది. వచ్చే నెల రెండో తారీఖున!" జనార్దనం అన్నాడు.

"అలాగా! విచారణకు వచ్చే టప్పటికి ఎన్ని వాయిదాలు పడతాయో? నీకేం ఫర్లేదులే!" భుజం తట్టాడు రంగా.

"నాకేం బెంగ?" నవ్వాడు.

* * *

"రేపు కోర్టు వాయిదాకి వెళ్ళాలిటండీ! ఇన్‌స్పెక్టర్‌గారు చెప్పతున్నారు" కానిస్టేబిల్ వచ్చి చెప్పాడు.

"వూఁ" అన్నాడు జనార్దనం.

"మాకు గుర్తుంది లేవోయ్! స్పెషల్‌గా కబురు చెయ్యక్కర్లేదు" అన్నాడు రంగా.

జనార్దనంతో రంగా కూడా కోర్టుకి వెళ్ళాడు. సాయంత్రం నాలుగయింది. వచ్చే నెలకు వాయిదా వేసినట్టు జడ్జీ ప్రకటించగానే రంగా విసుక్కున్నాడు. ఇద్దరూ కలిసి మెయిన్ రోడ్డు మీదకి వచ్చారు. అక్కడ రష్‌గా వుంది. లారీలు, బస్సులు, చిన్న కార్లు. రిక్షాలు వేగంగా కదిలిపోతున్నాయి. మెల్లిగా వెడుతున్న ఎడ్ల బళ్ళని చూసి విసుక్కుంటున్నారు. వచ్చే పొయ్యే జనాన్ని చూస్తూ కబుర్లు చెప్పుకుంటూ రోడ్డు పక్కన నిలబడ్డారిద్దరూ.

అవతలి వేపునుంచి గబగబా వెడుతున్న ఓ వ్యక్తిని చూసి జనార్దనం చప్పట్లు కొట్టాడు. అతను వెనక్కి తిరగలేదు. "ఏయ్ బాబూ!" అంటూ అరిచాడు. ఆ కేక ఆసామిని చేరలేదు.

"నువ్విక్కడే వుండు!" అని రోడ్డుకు అడ్డంగా పరుగెత్తాడు జనార్దనం.

అంతే........

వేగంగా వస్తున్న ఓ లారీ కీచుమంటూ ఆగిపోయింది. ఎక్కడివాళ్ళు అక్కడే నిలబడిపోయారు. డ్రైవరు డోరు తెరుచుకొని కిందికి దిగాడు.

రంగా పరుగెత్తుకు వచ్చి, "ఎంతపని జరిగిందిరా జనార్దనం!" అన్నాడు ఏడుస్తూ.

"బ....బం....డి....వాడు....వె....డు....తుం....దే...." ఇక

మాట్లాడలేకపోయాడు.

ఆసుపత్రికి తరలించుకు వెళ్ళారు.

డాక్టర్లు పరీక్షించి "అర్జంటుగా రక్తం ఎక్కించాలి" అన్నారు.

"ఈ గ్రూప్ రక్తం మా దగ్గర లేదు" అన్నారు బ్లడ్ బ్యాంకులో.

రంగా రక్త పరీక్ష చేయించుకున్నాడు. గ్రూప్ కలవలేదు. అక్కడ చేరిన వాళ్ళలో ముగ్గురు ముందుకి వచ్చారు. ఇద్దరిని పరీక్షించారు. ఉపయోగం లేక పోయింది. మూడో వ్యక్తిని పరీక్ష చేస్తుండగా జనార్దనం మరణవార్త వచ్చింది.

రంగాకి దిక్కు తోచలేదు.

'బందివాడి సాక్ష్యం కోసం పరిగెత్తి ప్రాణం పోగొట్టుకున్నాడు. నేను టేపు రికార్డుచేసిన వివరాలు వినిపించి వుంటే, ఈ పరిస్థితి ఏర్పడేది కాదు. నా వలనే వీడి ప్రాణం పోయింది. వీడి ఆకస్మిక మరణానికి నేనే కారణం!" పరి పరి విధాల బాధపడ్డాడు రంగా. ఎలాగో శవాన్ని యింటికి చేర్చాడు.

జనార్దనం మరణవార్త ఇన్‌స్పెక్టర్ని కలచివేసింది. 'హానెస్టుగా వుండే వాళ్ళకి ఈ లోకంలో స్థానం లేదు, .... వుంది — కాని మాలాటి వాళ్ళం వాళ్ళని యిబ్బందుల పాలు చేస్తున్నాం. అతను నిందితుడు కాదని తెలిసినా కేసు బనాయించాను. ఆ తర్వాతైనా నీకు భయంలేదని ఒక్కమాట చెప్పి వుంటే ఈ దారుణం జరిగేది కాదు. నా ప్రవర్తన వలన యిలా ఎంత


అలనాటి చరిత్రలను కళ్ళకు కట్టినట్లుగా
ఆబాల గోపాలాన్నీ అలరించిన మహోత్తర నవలలు



శ్రీప్రసాద్ రచనలు

ఆర్య చాణక్య విజయ సీరియల్. 10.00
రోషనార ,, ,, 8.00
అప్సాజ్ ,, ,, 10.00
యుగంధర్ ,, ,, 12.00

ఏ పుస్తకాల షాపుల్లోనైనా కొనండి. లేదా కోరే పుస్తకానికి రూపాయి తగ్గించి M.O. చేయండి — రూపాయికి విపి పెట్టి పంపుతాము

నవజ్యోతి పబ్లికేషన్స్ విజయవాడ 520002

మంది అమాయకులు బలై పోతు న్నారో!' ఇన్‌స్పెక్టర్‌లో పశ్చాత్తాపం ప్రారంభమయింది.

మర్నాడు సాయంత్రం ఊరు పెద్దలంతా సమావేశమై జనార్దనం సేవా తత్పరతను కొనియాడారు. ఆప్తులను ఆదుకునే దొడ్డమనసు కలవాడని అన్నారు. పీడితులను రక్షించే మనసు కలవాడన్నారు. ఎవరైనా బాధపడుతుంటే ముందూ వెనకా చూడక తక్షణం ఆదుకునే మంచి మనసు కలవాడన్నారు. 'పేరుకీ మనస్తత్వానికి సరిగ్గా సరిపోయింది. ఇలాంటి వ్యక్తి ఈ చుట్టు పక్కల ఎక్కడా లేడు. మంచివాళ్ళు త్వరగా ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోతారు' అని బాధ పడ్డారు. 'ఇలాంటి వ్యక్తిని కోల్పోయినందుకు మనం చాలా దురదృష్టవంతులం' అని అశ్రుతర్పణం వదిలారు. జనార్దనంలో వున్న సేవా తత్పరత ప్రతివారిలోనూ ఉండాలని, అలా వుండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రబోధించారు. ఇటువంటి మహోన్నత వ్యక్తిని పోగొట్టుకున్నందుకు మనం ఏం చెయ్యాలి అన్న ప్రశ్న పుట్టుకొచ్చింది కొందరికి. తర్జన భర్జనలు జరిపి, ఒక శిలా విగ్రహం స్థాపించాలన్న నిర్ణయానికి వచ్చారు. చందాలు వసూలు చేయడానికి నడుం కట్టారు.

నిర్ణయం తీసుకున్నదే తడవుగా హోటల్ యజమాని ముందుకు వచ్చి మూడొందలు తన విరాళంగా ప్రకటించి బోలెడు సానుభూతి గుప్పించాడు. శిలా విగ్రహ నిర్మాణ సమయంలో పని వారికి కాఫీ టిఫిన్లు తను వూరికే సరఫరా చేస్తానని వాగ్దానం చేశాడు. అప్పుడు జనార్దనానికి సాయం చేయడానికి ఇష్టపడని వారిలో కొందరు నూట పదహార్లు, మరి కొందరు అర్ధనూట పదహార్లు చదివించారు. మరికొంతమంది శ్రమదానం చేస్తామని చెప్పారు. ఇవన్నీ చూసిన ఇన్‌స్పెక్టర్‌కి విషాదంతో కూడిన నవ్వు వచ్చింది. అశాంతితో కొట్టుకున్నాడు.

తెల్లవారింది. ఇన్‌స్పెక్టర్ స్వయంగా పోస్టాఫీసుకు వెళ్ళాడు. రిజిష్టరు పోస్టులో ఒక కవరు పంపించి తృప్తిగా నిట్టూర్చాడు. అందులో అతని రాజీనామా పత్రం వుంది. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చిన ఇన్‌స్పెక్టర్ సంఘాన్ని సంస్కరించాలనే ఆలోచనతో రోడ్డుమీద అడుగు పెట్టాడు. అతని అడుగుల వేగం హెచ్చింది. ✱